# సంపాదకీయము

కాలము అన్నీ మరపిస్తుంది. అదే కాలం అన్నీ పునరావృత్తమనీ తెలియచేస్తుంది. ఆది అనాది రెండూ నేనే యనే స్ఫూర్తి భగవంతుడు మనకు కలగాలని ఋతువులు, అయనలూ, సంక్రాంతులు కలిగిన జగత్తును కల్పించాడు. మదిరాజు పున్నమినీ, అమావాస్యలూ కలిగి మన మనస్సులతో ఆటలాడటం, గురురాజుకు ఒప్పక, శ్రీ పంచమినాడు, సరిగ్గా 131 సంవత్సరములకు ముందు ఫతేఘడ్ లో అవతరించి మానవాళి జీవితంలో వసంతం పూయించినాడు. శ్రీ రామచంద్రుడు వసంత పంచమి స్వాతంత్ర్య దినోత్సవంని కూడి తిరిగి వచ్చి - మన కర్తవ్యాన్ని మరోమారు మననం చేసుకోమని తెలియచెప్తూంది. 'మన్మనా భవ'యంటూ జగద్గురువు పదే పదే పిలుపునిస్తున్నా చెవిలో శ్రవణయంత్రమును బిగించుకొని, బధిరులవలె వినిపించుకొనక, త్వరిత తిండి మూలంగా నోట మాటలురాని మూగలవలె మారు పలక్క మేమూయున్నామంటూ మనుగడ సాగిస్తున్న మనపై గల వ్యామోహంతో మరో మారు పిలుపునిచ్చాడు శ్రీ రామచంద్రుడు. కాస్తంత పాశ్చాత్య జిహ్వాచాపల్యం తగ్గించుకొని, గంగిరెద్దు వేషాన్ని సంస్కరించుకొని, సాటి మానవుల అవసరాలనెరింగి వున్నంతలో కొంత యిచ్చే మేలైన సాంప్రదాయాన్ని మరవక, మానవుడిగా మనే అవకాశాన్ని సద్వినియోగపరచుకొని మనీషిగా మలచుకొమ్మని మరోమారు పిలుపువచ్చింది. పశుత్వపోకడ, అసుర ప్రవృత్తి కొందరికి పరిమితమయితే నేనున్నానంటూ దివినుండి భువికి దిగి వచ్చేవాడే భగవంతుడు. ఎప్పుడయితే యీ జాడ్యం మానవాళినంతా ఆవరించినదో మార్గాంతరం వెదికిన ప్రకృతి, యిట్టి పరిస్థితిలోనూ మార్పు తీసుకొనిరాగలిగిన విశిష్ఠమూర్తిని మలచే బాధ్యత యీ పుణ్యదినం శ్రీ పంచమినాడే శ్రీ రామచంద్రునికి అప్పగించి మరో శ్రీ రామచంద్రోదయానికి నాంది పలుకమని ఆదేశమిచ్చింది. తనకప్పగించిన గురుతరమయిన బాధ్యతను తనదైన శైలిలో మౌనంగా బహుశ్రమలకోర్చి తన కర్తవ్యనిర్వహణ పూర్తికావించి మనకు మన పూజ్య బాబూజీని ఒసగిన, పరమపూజ్య ఆదిగురువయిన పూజ్య లాలాజీ గారి జయంతి, బసంత్ పంచమిని మన పర్వదినంగా కొనియాడే అవకాశం మళ్ళీ వచ్చింది.

పండుగలు పెక్కు మనకు. అది మనకు సహజమే. అది మన సంస్కారానికి చిహ్నం. ఏ కొంత సహాయపడినా, పుచ్చుకొన్నదానికి పదిరెట్లు, వంద రెట్లు, వేయిరెట్లు చెప్పి మన కృతజ్ఞతలు తెలుపడము మన జాతీయ సాంప్రదాయం.

బసంత్ పంచమినాడు, అదే నా కర్థంకాని విషయం కూడా. ఆకాశానికి చిల్లులు పడ్డాయాన్నంతగా నిరంతరము ప్రాణాహుతి ధార కుర్తుస్తున్న రోజులలోకూడా పరము, పోనీ, పరులవైపు మన దృష్టిని మరల్చలేనంతగా మనల్ని ఆకట్టుకొన్న ఎముకలగూటి గమ్మత్తేమిటాయని, జననం లాగే మృత్యువు సహజం ఏ ప్రాణికైనా. మొదటిది రాకూడదనీ,

రెండవది వుండకూడదనీ యీ నాడు పడే ప్రయాస పూర్వపు రోజుల్లో అసురులకుండేదని, అప్పుడప్పుడు మహేంద్రునికి కూడా యీజాడ్యముండేదని పురాణాలు చెపుతున్నాయి. ఇట్టి అసహజ వాంఛలు ఒకరికి కలిగితే తీర్చేవారుండొచ్చు కాక, అందరిదీ యిదే కోరికైతే భగవత్సృష్ఠి ఓ కొలిక్కి రావడం తథ్యం. అప్పుడు జరిగేది ప్రళయం. అంతా మునిగాక ఎవరైనా చేసేదేముంటుంది?

గురువుగారి గురుతర బాధ్యతలో పాలుపంచుకొని, సగటు మానవునిలో పారమార్థిక దృష్టి కలుగచేసే ప్రయత్నం, నింగికి నిచ్చెన వేసేటంత వెఱ్ఱియని పలువురు పరిహాసాలాడినా ఓర్చి, చేసిన ప్రతి పనికీ ప్రతి ఫలమాశించే తత్వాన్ని విడనాడి అంతా శ్రీ రామచంద్రుడనే మాట, మాటగాయొప్పచెప్పక, చేతలలో చూపే సత్తాయున్న నిరహంకారులై, తేజోమయులై, సతత స్మరణ ప్రేరితమైన గురువ్యామోహులై, కడుంగడు బాధ్యతతో మనగలిగిన ధృఢకాయ, మనో బలశాలులుగ తీర్చిదిద్దుచున్న మన పూజ్య బాబూజీని, మనకిచ్చిన మానవుల వరాల తండ్రి పూజ్య లాలాజీకి శతకోటి జయంతులనాశిస్తూ.

శ్రీ రామచంద్ర భక్త పాద దాసుడు

(సత్యపదము 11-1 బసంతపంచమి సంచిక మరియు 11-2 పూజ్య బాబూజీ జన్మదిన సంచికలోని సంపాదకీయము)